క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట: లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేషన్‌రోడ్డు, పాతసమితి ఆఫీసు, రామిరెడ్డిపేట, వరవకట్ట ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

ఇన్‌చార్జి ఏవోగా రామారావు

శావల్యాపురం: మండల వ్యవసాయ అధికారిగా (ఏఫ్ఏసీ) రామినేని రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈపూరు మండలం వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఇక్కడ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఖరీఫ్ సీజను ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పిల్లిపెసర, జనుము, జీలుగులు విత్తనాలు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అన్నీ రకాల ఎరు వులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అర్హత కల్గిఉన్న కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఏవో పల్లపోతుల ప్రవీణ్ తన మాతృశాఖకు బదిలీపై వెళ్లారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, వీపీఏ వెంకయమ్మ తదితరులు ఉన్నారు.

బాధితులకు సేవా సంఘం చేయూత



బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామంలో ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధిత కుటుంబానికి అరుం జ్యోతి సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు డి. కోటేశ్వరరావు శుక్రవారం వితరణ అందజేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ప్రమాదంలో గ్రామానికి చెందిన మేకల రాజు పూరిళ్లు అగ్నికి ఆహుతైందని, ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి తమవంతు చేయూతగా బియ్యం, బట్టలు, వంట సామగ్రి అందజేశామని అరుంజ్యోతి సేవా సంఘం అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి

రొంపిచర్ల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బ్యాంకు డిపాజిట్లపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌మేషన్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు నిర్వహించారు. డిపాజిటర్లు అందరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు తెలివిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ బి.అశోక్‌కుమార్, పాఠశాల ఎస్ఎంబీ సుభాని, సీజీబీబీ మేనేజర్ వేణు ప్రసాదు పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం 35 దరఖాస్తులు

నాదెండ్ల: మండలంలోని తూబాడు, ఎండుగుంపాలెం గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం కౌలు రైతుల గుర్తింపు కార్డులపై గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్‌లు గోళ్లమూడి కాశియ్య, గోరంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, కౌలుకు పొలాలను తీసుకుని పంటలు సాగుచేసే కౌలురైతులు ప్రభుత్వం జారీచేసే గుర్తింపు కార్డులను పొందాలన్నారు. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీలు, వివిధ పథకాల ప్రయోజనం వర్తిస్తుందన్నారు. జాతీయ బ్యాంకుల్లో సైతం పంటరుణాలు పొందే అవకాశం లభిస్తుందన్నారు. కరువు, పంటనష్టపోయిన పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి పరిహారం సైతం పొందవచ్చన్నారు. రెండు గ్రామాల రైతుల నుంచి 35 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో ఆనంద్‌కుమార్, వీఏఏ జీవలానాయక్, వీహెచ్ఏ కృష్ణ సౌజన్య, ఏహెచ్ఏ షేక్ షాహినా పాల్గొన్నారు.

వడ్లమూడివారిపాలెంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు



రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని రైతులు వ్యవసాయ పనిముట్లతో సిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి పొలాలకు వెళ్లి వ్యవసాయ పనిముట్లతో పనులు ప్రారంభించారు. దేవాలయంలో పూజా కార్యక్రమాలను పేర్ల వంశీకులు నిర్వహించగా, గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా యోగా దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్, నరసరావుపేట: ప్రతి ఒక్కరి దినచర్యలో యోగ భాగం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆకాంక్షించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో పలు యోగ సేవా సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంతి పాదయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో యోగ గురువులు కూనిశెట్టి వెంకట జనార్దన్, వై.రాజ్యలక్ష్మి, సహాయ యోగా బోధకులు జల్లి శ్రీనివాసరావు, కె.పేరారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో గల సప్తపది కల్యాణ మండపంలో శుక్రవారం సాయిషా యోగా సెంటర్ ఆధ్వర్యంలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. ప్రముఖ విద్యావేత్త ఈయం.స్వామి అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథులుగా నల్లపాటి రామచంద్రప్రసాదు, రిటైర్డు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెంట్ సయ్యద్ మూసా విచ్చేసి యోగా గొప్పతనంపై ప్రసంగించారు. దీనిలో సహాయ యోగా గురూజీ కె.పేరారెడ్డి ఆధ్వర్యంలో గురూజీ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో 150మంది యోగా సాధకులు యోగాసనాలు ప్రదర్శించారు. పి. శ్రీనివాస్, మురారిశెట్టి రమేష్, డీసీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, సాంబ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువుల వద్ద..

యడ్లపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని మూడు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యడ్లపాడు, తుర్లపాడు, సొలస గ్రామాల్లో అమృత్ సరోవర్ కింద పనులు నిర్వహించిన ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద యోగా డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామం నుంచి చెరువుల వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెరువు గట్లపై వివిధ యోగాసనాలను వేశారు. గ్రామసర్పంచ్‌లు దావల వెంకయ్య, పి వేణుగోపాలరావు, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గ్రామపెద్దలు వీరారెడ్డి, కార్యదర్శులు అఖిల్, శశికళ, హైస్కూల్ హెచ్ఎం ఈవీ శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం టీఏజి మాధవి, సతీష్, ఏపీవో రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పిల్లలు, ఉపాధి పథకం కూలీలు పాల్గొన్నారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల సాయిబాబా గుడి ఆవరణలో సాయి పతాంజలి యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కనిగండ్ల అనంత కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి ఈ ఆవరణలో యోగా నిర్వహిస్తున్నామని, ఈ యోగా ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కొప్పురావూరి శ్రీనివాసరావు, రెడ్డి నగేష్, కాకుమాను రాముడు, శ్రీనివాస్, పి.శ్రీనివాసరెడ్డి, ఎం.మల్లి, బి.కృష్ణమూర్తి, బి.దుర్గారావు, కె.సీతారామయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, రవి, రమేష్, కోటేశ్వరనాయక్, అమరనాథ్, పి.సురేష్, ప్రసాద్, సీహెచ్. సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల ఆట స్థలంలో యోగా డేను నిర్వహించారు. శిక్షకులుగా వెల్లటూరు గ్రామానికి చెందిన లింగరాజు యోగా ఆసనాలు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్. సుబ్బారావు, ఆడిటర్ రాఘవులు, మేడం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలలో...

పట్టణంలోని నరరావుపేట రోడ్డులోగల మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురకుల పాఠశాల (బాలుర)లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన పలు యోగా ఆసనాలు, ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వరప్రసాద్, ఏటీపీ రాధా, ఉపాధ్యాయులు, పీఈటీ జోనా నాయక్ పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండలంలోని పలు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులచే ఉపాధ్యాయులు యోగా ఆసనాలు వేయించారు. అదేవిధంగా మండలంలోని ముప్పాళ్లలో గల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల, ధనలక్ష్మి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు ప్రిన్సిపాల్ జి.నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మానసిక ఉల్లాసానికి శారీకర దృఢత్వానికి యోగాసనాలు ఎంతో దోహదపడతాయని మండల ప్రోగ్రాం కో ఆర్డినేటరు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 10వ యోగా అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు సందర్భంగా విద్యార్థులచే రకారకాల యోగాసనాలు విన్యాసాలు చేయించారు. జాతీయస్థాయిలో యోగాసనాలు ప్రదర్శనలు ఇచ్చిన కోడూరి వినీతచే పలు రకాల ఆసనాలు వేయించి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు అందుకున్న విద్యార్థి కోడూరి వినీత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో ఆరోగ్యకరమైన భారతదేశం తేవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యాదాల అనిల్‌కుమార్, జ్యోతి శ్రీనివాసరావు, నాగులపాటి రామాంజనేయులు, సూరబత్తిని శివప్రసాదు, నండూరి శ్రీరామ్మూర్తి, కొండ్రు నాగేశ్వరరావు, బొల్లా రామకృష్ణ, యలవర్తి గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ప్రపంచానికి యోగాను కానుకగా అందించిన ఘనమైన సంస్కృతి మన దేశానిదని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగాభ్యాసం చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, ధ్యానమండలి యోగా గురువు ప్రసాద్ చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు ప్రసాద్ విద్యార్థులకు యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పాలక మండలి సభ్యులు చుండి రంగనాయకులు (జూనియర్), లైబ్రేరియన్ నిరంజన్, కళాశాల పీడీ నాగేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: యోగా భారతీయ వారసత్వ సంపదని.. ప్రతిఒక్కరూ దినచర్యలో యోగాను భాగస్వామ్యం చేసుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలని హెచ్ఎం కేవీ రామిరెడ్డి చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్లో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలను వేశారు.

ఏఎంజీలో...

చిలకలూరిపేట: ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా ఎంతో దోహదపడుతుందని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి పేర్కొన్నారు. పట్టణంలోని ఏఎంజీ హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామోపాధ్యాయులు రాజు, రాజేష్‌లు యోగా సనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూలులో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా గురువు, యోగ ప్రొఫెసర్ కోలా సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా వల్ల విద్యార్థులలో ఏకాగ్రత పెరగుతుందనీ, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందనీ, స్వీయ క్రమశిక్షణ అలవడడమే కాకుండా ఉత్సాహశక్తి, అంతర్గత శక్తి సామర్థ్యాలు పెరగుతాయని అన్నారు .ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్, ఆ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు యోగా అభ్యసించాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు ప్రతిరోజు యోగా అభ్యాసన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు విద్యాసంస్థలు సామూహిక యోగాసనాలు కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగ దినోత్సవంలో డీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో క్రమశిక్షణ, అంకిత భావం, జ్ఞాపకశక్తి పెంపొందేందుకు యోగా దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యోగ గురువు కూనిశెట్టి వెంకట జనార్థన్, జల్లి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో..

ఎన్‌సీసీ 23ఏ బెటాలియన్ గుంటూరు గ్రూప్ కల్నల్ సునీవ్‌గౌతమ్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ విద్యాసంస్థల ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆయా విద్యాసంస్థల్లోని ఎన్‌సీసీ క్యాడెట్స్ సామూహిక యోగాసనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్త, యోగ గురూవు జి.వెంకట సుబ్బయ్య, పిరమిడ్ మాస్టర్ పదిర నాగబ్రహ్మం, ఎన్‌సీసీ ఆఫీసర్లు మేజర్ జి.వి.రావు, మేజర్ బీఎస్ఆర్‌కె రాజు, మేజర్ వై.అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, కెబిఆర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ మధుసూధనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో...

గుంటూరురోడ్డులోని కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం, మ్యూజిక్ డే ఘనంగా నిర్వహించారు. యోగా మాస్టర్ శివ, సునీతావాణి విద్యార్థులతో యోగాసనాలు అభ్యాసం చేయించారు. సంగీతం ఉపాధ్యాయిని నాగలక్ష్మీ సంగీతం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ మల్లీశ్వరి, అకడమిక్ ఇన్‌ఛార్జ్ బర్నబాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట ఏఎంజీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



లింగారావుపాలెం జడ్పీహైస్కూల్‌లో యోగాసనాలు వేయిస్తున్న పీఈటీ



వినుకొండలో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు



యోగాభ్యాసాలు నేర్పిస్తున్న యోగా గురువు ప్రసాద్



నరసరావుపేటలో యోగా చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



వేల్పూరులో యోగాసనాలు వేయిన్న వినీత



ఈపూరు ధనలక్ష్మీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



వినుకొండలో యోగాసనాలు వేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



సొలసలో యోగ ప్రాముఖ్యతను వివరిస్తున్న దృశ్యం



సొలసలో చెరువు గట్టుపై యోగాసనాలు చేస్తున్న గ్రామపెద్దలు, సిబ్బంది



జేఎన్‌టీయూఏఎన్ లో మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు



వినుకొండ సాయి పతంజలి యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలు



రొంపిచర్లలో యోగాసనాలు వేస్తున్న ప్రొఫెసర్ కోలా సాంబశివరావు, ఉపాధ్యాయులు



యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు



కే-రిడ్జి స్కూల్‌లో యోగాడేలో పాల్గొన్న విద్యార్థులు



ఎంఏఎం కళాశాలలో విద్యార్థులతో కలిసి యోగాసానాలు వేస్తున్న కళాశాల చైర్మన్

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

నరసరావుపేట రూరల్: యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల అమృత్ సరోవర్ ట్యాంక్ వద్ద ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శారీరక, మానసిక తీవ్ర ఒత్తిడితో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికాంత్, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ పార్వతి, ఉపాధి హామీ సిబ్బంది ప్రదీప్‌కుమార్, శ్రీనివాసరావు, రోశయ్య, టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి, యాదాల మహానందిరెడ్డి పాల్గొన్నారు.

కళాశాలల్లో..

కాకాని జేఎన్‌టీయూఏఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబు, డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. కేసానుపల్లి ఎంఏఎం గ్రూప్ కళాశాలల్లో యోగా ట్రైనర్ ఆర్.లక్ష్మీప్రసన్న వివిధ రకాల యోగాసనాలు, వాటి ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరి రావు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు

నరసరావుపేట రూరల్: కౌలురైతులు పంట సాగుదారు కార్డులు(సీసీఆర్‌సీ) తీసుకోవడం ద్వారా ప్రభుత్వం పథకాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని పమిడిపాడులో పంట సాగుదారు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగుదారు కార్డు వలన భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలగదని తెలిపారు. కౌలుదారులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు, పంట రుణం, పంట బీమా, సబ్సిడీ పథకాలు, పంట కొనుగోలుకు ఈ కార్డు ఉపయోగపడుతుందని వివరించారు. కౌలు రైతులు ఆర్‌బీకేలోని వ్యవసాయ సహాయకుని వద్ద సీసీఆర్‌సీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవిన్యూ అధికారి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి కౌలుదారు గుర్తింపు కార్డులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌వో యల్లమంద ఎంపీఈవో కె.అశోక్, టీడీపీ నాయకులు లాం కోటేశ్వరరావు, పూనాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో నరేంద్రబాబు

పేటలో యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: పట్టణంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పురపాలక సంఘం మార్గంలో కోర్టు వద్ద ఉన్న చెట్టు కింద సాయంత్రం 5 గంటల సమయంలో ఓ యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి 108 ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న సిబ్బంది వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు విచారణలో మృతుడు పట్టణ వాసిగా గుర్తించారు. చీరాల రోడ్డులోని వెంగళరెడ్డి కాలనీలో నివాసం ఉంటూ కరెంటు, డెకరేషన్, పెయింటింగ్ వంటి పనులు చేసుకునే పాపబత్తిని ఎలీషా(31) అని నిర్ధారించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

శావల్యాపురం: వర్షాకాలం నేపథ్యంలో దోమల వల్ల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కేతిపల్లి రవీంద్ర రత్నాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయటంతో పాటు మండలంలోని కనమర్లపూడి గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ మురుగుకాల్వలో మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమలు వ్యాప్తి చెంది దోమకాటుకు గురై మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర వ్యాధుల బారిన పడతారన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి రావిపూడి రమ్య, వినుకొండ సబ్ యూనిట్ మలేరియా అధికారి సుబ్బారావు, సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంకీర్తన, అంగన్‌వాడీ కార్యకర్త బాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



కనమర్లపూడిలో సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

బొల్లాపల్లి: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం దిశగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ వీఏ విజయకుమార్ అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులుకు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ హెచ్ఎం నుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలును సద్వినియోగపరచుకోవాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు మంచి బోధన అందించడటం జరుగుతుందన్నారు. అనంతరం ఎంఈఓ 1 సయ్యద్ జప్రుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయులు మేం బడికి పోతాం కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. జూలై 12 వరకు ఆయా పాఠశాలల పరిధిలో సర్వేతోపాటు గ్రామాలో బడిబయట పిల్లలను గుర్తించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్గించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అందుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమలో ఎంఈఓ 2 కె పార్వతి, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు కె అరుణ కె.రమాదేవి, ఎస్‌కె అలీషా పాఠశాలల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమార్

వినుకొండలో అన్నదానం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవన ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అవ్వారు కోటేశ్వరరావు, పద్మావతి కుటుంబసభ్యుల చేతుల మీదుగా పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భువనగిరి సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వరరావు, కాళ్ల కృష్ణమూర్తి, వై.వి.సుబ్బయ్య శర్మ, గోపిచంద్, శర్మ, ఎస్ఎస్ శాస్త్రి, జి.నాగేంద్రుడు, సీహెచ్. సుబ్బారావు, రాఘవయ్య, సీహెచ్. వెంకటస్వామి, దీక్షితులు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సంఘం నాయకులు